గెలుపుపై వాసుపల్లి ధీమా

- జగనన్న చేసిన మంచే గెలిపిస్తుందని పార్టీ కేడర్ వద్ద వెల్లడి
- దక్షిణ ప్రజలు.. పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం అని స్పష్టీకరణ


సమావేశంలో పాల్గొన్న పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు


పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉత్సాహం పంచుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : విజయంపై వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. విజయం మనదే అంటూ ఉత్సాహంగా చెప్పారు. ఓటు వినియోగించుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆశీర్వచనాలు అందజేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అనంతరం ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వార్డుల్లో వైఎస్సార్‌సీపీకి ఓటింగ్ ఎలా జరిగింది. ఎంత మెజార్టీ సాధిస్తామో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ 47 రోజుల ఎన్నికల ప్రచారంలో కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి వైఎస్సార్‌సీపీకి ఓటింగ్ శాతం పెంచారని, ప్రజలు కూడా జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకున్నట్టు తెలిసిందన్నారు.

పార్టీ శ్రేణుల ధీమా..

వాసుపల్లి విజయంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ధీమా వ్యక్తం చేశారు. ముందుగా ఆయనకు అభినందనలు తెలిపేందుకు నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. వార్డుల వారీగా వాసుపల్లి కార్యాలయానికి వచ్చిన వారంతా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా వార్డుల్లో జరిగిన పోలింగ్ సరళి, ప్రజల తీర్పు ఏ విధంగా ఉందో ఆయనకి వివరించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో ఓటర్లంతా తాము వాసుపల్లికే ఓటు వేశామని చెప్పారని నాయకులు, కార్యకర్తలు వాసుపల్లికి తెలియజేశారు. స్థానికేతరుడు, దక్షిణ సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌ను స్థానిక ఓటర్లు వెనక్కి నెట్టినట్లు తెలిపారు.

వార్డు నాయకులు, కార్యకర్తలతో మాటామంతీ..

ఎన్నికల కోసం చెమటోడ్చి కష్టపడిన పార్టీ శ్రేణులతో వాసుపల్లి మనసారా మాట్లాడారు. మనందరి కష్టానికి మంచి ఫలితాలు వస్తాయని.. మళ్లీ జననేత జగనన్న విజయం తథ్యమని వాసుపల్లి పార్టీ నేతలు, కార్యకర్తలతో చెప్పారు. మరోసారి అందరం ప్రజాసేవలో భాగస్వాములం అవుదామని వాసుపల్లి వారితో చెప్పారు. అందరితో కలిసి సరదాగా ఫొటోలు దిగారు.

ప్రజల నుంచి పాజిటివ్ రెస్పాన్స్..

ఎన్నికల సమరం ముగిసిన తర్వాత చాలా మంది స్థానిక ఓటర్లు తామంతా వాసుపల్లికే ఓటు వేశామని చెబుతుండడం విశేషం. ఎన్నికలు వస్తున్నాయని కాకుండా వాసుపల్లి నిరంతరం పేదల మధ్యే ఉన్నారని.. ఎంతో మందికి ఆపన్న హస్తం అందించి ఆదుకున్నారని ప్రజలు తెలిపారు. అలాంటి నాయకుడే తమకు కావాలని వారంతా ముక్తకంఠంతో స్పష్టం చేశారు. జగనన్న అందించిన అభివృద్ధి, సంక్షేమం.. వాసుపల్లి చేసిన సాయం తాము ఎన్నడూ మరవబోమని చెబుతుండడం విశేషం. మంగళవారం వాసుపల్లి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, కోడూరు అప్పలరత్నం, చెన్నా జానకీ రామ్, మాసిపోగు మేరీజోన్స్, వార్డుల నాయకులు, ఆలయ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో నేతల భవితవ్యం..

పురాతన, రాజకీయ ప్రాశస్త్యం కలిగిన దక్షిణ నియోజకవర్గం సర్వమత సమ్మేళనంతో కూడుకున్న ప్రాంతమని చెప్పాలి. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లంతా కలిసిమెలిసి జీవిస్తారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉండే ఈ ప్రాంత ప్రజల్లో రాజకీయ చైతన్యం కూడా అధికమే. అటువంటి దక్షిణం ఈ సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏ పార్టీ పరమవుతుందా అని అందరిలో ఉత్కంఠ నెలకొంది. బ్యాలెట్ ఏ నాయకుడి భవితవ్యం ఎలా నిర్దేశిస్తుందో మరి కొన్ని రోజుల్లో తేలనుంది.

- అసెంబ్లీ స్థానానికి పోటీ పడ్డ 16 మంది అభ్యర్థులు
- వైఎస్సార్‌సీపీ.. జనసేన మధ్యే ప్రధాన సమరం
- ఫలితాల కోసం సర్వత్రా ఉత్కంఠ

దాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. అభ్యర్థుల భవిష్యత్ ఈవీఎంలలో భద్రంగా ఉంది. నిన్న మొన్నటి వరకు ఓటర్లపై ఆధారపడ్డ అభ్యర్థులందరూ ఇప్పుడు ఈవీఎంలపై ఆధారపడ్డారు. ఎన్నికలు జరిగి రెండు రోజులైనా.. అభ్యర్థుల కళ్లల్లో మాత్రం ఈవీఎంలే కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. మా పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి..మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయని కార్యకర్తలు.. నాయకులు బేరీజు వేసుకుంటున్నారు. ఇక్కడి గెలుపుపై కొంత మంది పందాలకు దిగుతున్నారు. ఎవరి అంచనాలు వారు చేస్తున్నారు.

అదృష్టం పరీక్షించుకోనున్నారు..

2024 సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి 16 మంది ఎమ్మెల్యే పదవికి పోటీ చేశారు. వీరిలో అదృష్టం ఎవరిని వరించనుందో? వైఎస్సార్‌సీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్, జనసేన నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్ కుమార్‌తో పాటు గుంటు దుర్గాప్రసాద్, బూర శ్రీనివాసరావు, యర్రంశెట్టి సురేష్‌కుమార్, రావాడ తాతారావు, వంశీ కీర్తికుమార్ బుద్ధవరపు, కె. శ్రీదేవి, సూరాడ ఎల్లాజీ, కడగల ఈశ్వరరావు, కిలపర్తి మంగరత్నం, డోల జగదీష్, తారకరామ్ లగిశెట్టి, జె. బిపిన్‌కుమార్ జైన్ పోటీలో ఉన్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ, జనసేన అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంది.

2009, 2014, 2019లో ఇలా..

2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్ గెలుపొందారు. 35.66 శాతంతో 45,971 ఓట్లతో ద్రోణంరాజు గెలుపొందగా.. 35.40 శాతం ఓట్లతో 45,630 ఓట్లతో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన కోలా గురువులు ఓటమి పాలయ్యారు. వీరిద్దరి మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 341. తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన వాసుపల్లి గణేష్‌కుమార్ 18.78 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇదిలా ఉండగా 2014 ఎన్నికల విషయానికొస్తే 51.45 శాతం.. అంటే 66,686 ఓట్లతో వాసుపల్లి విజయం సాధించగా.. కోలా గురువులు 48,370 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 18,316 ఓట్ల మెజార్టీని వాసుపల్లి సాధించారు. 2019 ఎన్నికల విషయానికొస్తే.. వాసుపల్లి గణేష్‌కుమార్ తన సమీప ప్రత్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై 3729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ ఏర్పడి, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతూ ఆ పార్టీలో చేరారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఆయనే పోటీలో నిలిచారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు తెరుచుకున్న గేట్లు


పోలీస్ కల్యాణ మండపానికి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గేటు

అల్లిపురం : గతంలో మూతపడ్డ సూర్యాబాగ్ పోలీస్ కమిషనరేట్‌లో గల పాపాహోంకు వెళ్లే గేట్లు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. ఏడేళ్ల క్రితం అప్పటి పోలీస్ కమిషనర్ ఈ గేటును మూసివేసి గోడ కట్టారు. దీంతో పాపాహోంకు, పోలీస్ కల్యాణ మండపానికి, రిజర్వ్ లైన్ మసీదుకు, రామాలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వెళ్లే వారు ఇబ్బందులు పడేవారు. నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యన్నార్ ఎట్టకేలకు కాంపౌండ్ వాల్‌ను తొలగించి గేటు ఏర్పాటు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రిజర్వ్‌లైన్ మసీదు ప్రతినిధులు, రామాలయ భక్తులు, సుబ్రహ్మణ్య స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విరిగి పడిన చెట్టు కొమ్మలు


ద్వారకానగర్ ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్టు కొమ్మలు

సీతమ్మధార : సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సీతంపేటకు వస్తున్న రోడ్డుపై చెట్టు కూలి ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌లు

- వాహన చోదకుల అవస్థలు


కోదండ రామాలయం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్

అల్లిపురం : జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పనితీరు విమర్శలకు దారి తీస్తోంది. డస్ట్‌బిన్ లు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లిపురం మెయిన్‌రోడ్డు శ్రీ కోదండ రామాలయం వద్ద, సింహాలదేవిడి, బంగారుమెట్ట సులభ్ కాంప్లెక్స్, మోడల్ స్కూల్ వద్ద రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డస్ట్‌బిన్‌లు రోడ్డుకు ఒక వైపుగా ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు


విశేష పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చిస్వామికి అభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

స్థానిక నాయకుడిదే గెలుపు

- 'దక్షిణ' ప్రజల మనోగతం
- చేసిన మంచి ఎక్కడికీ పోదని స్పష్టీకరణ

జగదాంబ/అల్లిపురం : సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. పార్టీలు, అభ్యర్థుల హడావుడి తగ్గింది. ఈ సమయంలో దక్షిణ ప్రజలు ఏ పార్టీ గెలుపు బాట పడుతుందో.. ఏ అభ్యర్థి విజయం సాధిస్తారో.. తాము ఎవరి పక్షాన నిలిచామో చర్చించుకుంటున్నారు. జూన్ 4న వచ్చే ఫలితాల్లో తాము నిర్దేశించిన పార్టీయే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు మంచి చేసిన నేతే గెలుస్తాడు..



పేదల కోసం ఆలోచించే నాయకుడే ఈ ఎన్నికల్లో గెలుస్తాడు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా ఏం చేయాలో ఆలోచించి అభివృద్ధి, సంక్షేమం అందించిన నాయకుడికే విజయావకాశాలు అధికంగా ఉంటాయి. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మసి పూసి మారేడు కాయ చేసే నేతలెవరూ గెలవరు.

– ఆదివిష్ణు, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

జనాల మనిషిదే దక్షిణం..



దక్షిణ నియోజకవర్గంలో ప్రతి గడప తెలిసిన నాయకుడే గెలుస్తాడు. ఐదేళ్ల పట్టించుకోకుండా.. ఎలక్షన్ల సమయంలో వచ్చి నిలబడితే ఎవరు గెలిపిస్తారు. నిత్యం తమతో ఉన్న వారినే ఇక్కడి వారు ఎన్నుకుంటారు.

– వాసర్ల సుబ్రహ్మణ్యం, దుర్గాలమ్మ సమాజం, జీవీఎంసీ 35వ వార్డు

లోకల్ నాయకుడిదే గెలుపు..



దక్షిణంలో ఎవరు ఎక్కడి నుంచి వచ్చి పోటీ చేసినా.. లోకల్ నాయకుడిదే అంతిమ విజయం. దక్షిణ నియోజకవర్గం మిగిలిన నియోజకవర్గాల కన్నా భిన్నమైనది. ఇక్కడి వారి సమస్యలు తెలిసి.. వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడు గెలవబోతున్నాడు.

– నౌషద్, గాజులవీధి, జీవీఎంసీ 39వ వార్డు

కులమతాలకు అతీతంగా సేవ చేసిన నాయకుడిదే గెలుపు



దక్షిణ నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేసిన వ్యక్తి ఎవరో ఆ వ్యక్తే గెలుస్తాడు. పేదలతో కలిసి మెలిసి తిరుగుతూ, వారి బాగోగులు తెలుసుకుని సాయపడిన నేతను ఈ దఫా విజయం వరించబోతుంది. చేసిన మంచి ఎప్పటికైనా మేలే చేస్తుందని తెలుస్తుంది.

– పటాన్ ఖాజావలీ, జనతాబజార్, జీవీఎంసీ 35వ వార్డు

పేదలకు అండగా నిలిచిన ప్రభుత్వానిదే గెలుపు..



పేదలకు అండగా నిలిచిన ప్రభుత్వమే గెలుస్తుంది. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని అందించే నాయకుడి పక్షానే ఓటర్లంతా నిలిచారు. కల్లబొల్లి కబుర్లు చెప్పి, ప్రజలను మోసం చేసే నాయకుల మాటలు ఎవరూ నమ్మలేదు. అరచేతిలో స్వర్గం చూపిన వారికి గుణపాఠం తప్పదు.

– డి.భారతి, అల్లిపురం

విద్యా వ్యవస్థ బలోపేతం చేసిన నాయకుడికే మద్దతు..



విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన నాయకుడే గెలుస్తాడు. పేద విద్యార్థులు, ప్రభుత్వ బడుల అభివృద్ధికి ఎవరైతే కృషి చేశారో వారిని విజయం వరించబోతుంది. జూన్ 4న కచ్చితంగా అదే జరిగి తీరుతుంది.

– మొల్లేటి హరీష్, కుమ్మరవీధి

ప్రజల అవసరాలు తెలిసిన వారికే నా మద్దతు..



ప్రజల అవసరాలేమిటో తెలుసుకుని, పథకాలు రూపొందించిన నాయకుడినే ప్రజలు ఎన్నుకున్నారు. ఎలక్షన్లలో ఓటరు తమ నిర్ణయాన్ని తెలియజేశారు. మరో 20 రోజుల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడనుంది.

– హర్షవర్ధన్‌రెడ్డి, అల్లిపురం

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న నీలాపు శ్రీనివాసరావును ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ, దోమల చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా క్రీడా విభాగంలో సత్కరించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, సీఎస్ఆర్ఎంవో లక్ష్మీతులసీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, సార్జెంట్–1 గోవిందరావు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రామారావు, లక్ష్మణ, రమణ, పార్వతి, షేక్ బేగం, రాజారావు, అప్పలస్వామి, వెంకట్రావు, తులసి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రపంచ డెంగ్యూ దినోత్సవం రేపు

మద్దిలపాలెం : జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ డెంగ్యూ దినోత్సవం జరగనుంది. డెంగ్యూ ప్రబలడానికి కారణమైన దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. దీనిలో భాగంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రదర్శనలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. డెంగ్యూ జ్వరం లక్షణాలు, నివారణ చర్యలు తెలియజేయనున్నారు.

పోలింగ్ సరళి ఇలా..


దొండపర్తి పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సరళి ఈ విధంగా ఉంది. మొత్తం ఓటర్లు 2,16,770 మంది. కాగా పురుషులు 1,06,444. వీరిలో 66,260 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక మహిళల విషయానికొస్తే 1,10,293 మంది ఓటర్లలో 71,209 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 33 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ అర్ధరాత్రి వరకు సాగింది. 63.42 ఓటు శాతం నమోదైంది.

'కిక్కు' దిగింది..

- డీలా పడిన మందుబాబులు
- వేరే వ్యాపకాల కోసం పడిగాపులు

దాబాగార్డెన్స్ : నిన్న మొన్నటి వరకు మందేసి చిందేస్తూ కనిపించిన మందుబాబులు, రాజకీయ కూలీలు పోలింగ్ పూర్తయ్యేసరికి ఒక్కసారిగా డీలా పడిపోయారు. పని పాట లేకుండా తిరిగే వారిని ఎవరూ ఖాతరు చేయకపోయినా ఎన్నికల పుణ్యమా అని ఖద్దరు చొక్కాల నేతలు వారి భుజాన చేతులేసి, జేబులో సొమ్ములు నింపి.. తాగినంత మందు, తిన్నంత బిర్యానీ, భోజనంతో వారికి పసందు చేసి, తమ వెంట తిప్పుకున్న సంగతి తెలిసిందే. ఎన్నికల నామినేషన్ రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు పలువురు అభ్యర్థులను అంటిపెట్టుకొని ఉన్న వారి పంట పండిందనే చెప్పాలి. ఉదయం లేవగానే.. ఆయా పార్టీల కండువా కప్పుకుని, జెండా పట్టుకుని వెళ్లి ప్రచారం చేయడంతో బాగానే కాలక్షేపం అయింది. గిట్టుబాటు కూడా జరిగింది. ఈ భోగం మళ్లీ ఎప్పుడొస్తుందో అంటూ వారు ఇప్పుడు నీరసపడ్డారు. దాదాపు 45 రోజుల పాటు ఎంజాయ్ చేసిన వారంతా ఒక్క రోజులోనే డీలా పడిపోయారు.

జాతరకు ఆలయం ముస్తాబు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్యదైవం దుర్గానగర్ దుర్గమాంబ జాతరను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. 26న అమ్మవారి జాతర చాటింపు, 27న తొలేళ్ల సంబరం, 28న ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమలకు భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవం


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్ద బేరి గురుమూర్తిరెడ్డి తదితరులు


ఉత్సవంలో ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

సీతమ్మధార : రేసవానిపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు కుంకుమలు, ఫల పుష్పాలు ఇత్యాది కానుకులు సమర్పించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సేవ గరిడీ, పులివేషాలు, నేల వేషాలతో అమ్మవారి అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేసవానిపాలెం గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, సెక్రటరీ జీరు అప్పలస్వామిరెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు కృష్ణవేణి

మల్కాపురం: రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ మహిళను ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు కృష్ణవేణి (45)కి వివాహం కాకపోవడంతో, తన తమ్ముడి కుటుంబంతో కలిసి అల్లిపురం ప్రాంతంలో ఉంటున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటు వేసి ఇంటికి వెళ్లిన ఆమె, సాయంత్రం సమయంలో ఇంటి నుంచి వచ్చి నేవల్ డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వంతెన వద్ద రాత్రి 7గంటలకు నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో కృష్ణవేణికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించిందని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె వివరాల కోసం విచారించి, వారి బంధువులకు కృష్ణవేణి మృతి గురించి వివరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

మానవీయ విలువలకు భాషలే మూలం

ఎంవీపీ కాలనీ: మానవీయ విలువలకు భాషలే మూలాధారమని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్ తెలిపారు. సంస్కృతం, హిందీ, తెలుగు భాషల ప్రావీణ్యంపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్‌లో మంగళవారం ఉచిత వర్క్‌షాపు ప్రారంభమైంది. 'ఎన్‌రిచింగ్ హ్యూమన్ వ్యాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్' పేరిట ఈ వర్క్‌షాపు ఈ నెల 18వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఉద్యోగం, సంపాదనే లక్ష్యం కాకూడదని, సమాజంలో విలువలు పెంచే దిశగా కూడా కృషి జరగాలని సూచించారు. భాషల్లో ప్రావీణ్యం ద్వారా సమాజ విలువలు పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అయ్యగారి ఆనంద్, డాక్టర్ వారణాసి వెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.